నమస్తే తెలంగాణ

కరీంనగర్

5 | కరీంనగర్, గురువారం 12 సెప్టెంబర్ 2024 | KARIMNAGAR

# కరీంనగర్ డెయిరీపై అసత్య ప్రచారం

- ఇది కెమికల్ ఫ్యాక్టరీ కాదు
- పర్యావరణానికి హాని లేకుండా పాలు ప్రాసెసింగ్ చేస్తున్నాం
- నీటిని తిరిగి వినియోగిస్తున్నాం
- డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పీ శంకర్‌రెడ్డి

కరీంనగర్ విద్యానగర్, సెప్టెంబర్ 11 : రాష్ట్రంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉన్న కరీంనగర్ డెయిరీని బద్‌నాం చేయడానికి కొంత మంది అసత్య ప్రచారం చేస్తున్నారని డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పీ శంకర్‌రెడ్డి మండిపడ్డారు. ఆరోపణల్లో ఎంత మాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. కరీంనగర్‌లోని పద్మనగర్ 16 వార్డు ప్రతినిధితో కలిసి కొంత మంది ప్రజలు ఈనెల 10న డెయిరీ ఎదుట ఆందోళన చేసిన విషయం తెలిసిందే కాగా, దీనిపై ఆయన సీరియస్‌గా స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డెయిరీ పరిధిలో కెమికల్స్ వాడుతున్నారంటూ చేసిన విమర్శలను ఖండించారు. ఎటువంటి కెమికల్స్‌గానీ, రసాయన పదార్థాలు వినియోగించడం లేదని స్పష్టం చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులతో శాస్త్రీయంగా పర్యావరణానికి ఎటువంటి హాని లేకుండా పాలు, పాల పదార్థాలు ప్రాసెస్ చేస్తున్నామని తెలిపారు. బాయిల్ చిమ్నీ ద్వారా బూడిద పైకి వస్తుందని, పొగ వ్యాప్తి జరుగుతుందని చేసిన ఆరోపణను కొట్టిపారేశారు. చిమ్నీ, బూడిద ద్వారా పొగ బయటకు వ్యాప్తి చెందదని, ఇది కూడా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సూచన మేరకు నడుస్తుందన్నారు. పాలు, ఇతర పదార్థాల తయారీ ప్రాసెస్ నిమిత్తం వినియోగించే నీటిని ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఈటీపీ) ద్వారా శుద్ధి చేస్తూ తిరిగి డెయిరీ అవసరాలకు వినియోగిస్తున్నామని, దీని వల్ల ఎలాంటి గ్రౌండ్ వాటర్ పొల్యూషన్ కాదని స్పష్టం చేశారు. డెయిరీపై లక్ష మంది పాడి రైతుల ఆధారపడి ఉన్నారని, ఈ నేపథ్యంలో డెయిరీపై అసత్య ఆరోపణలు చేసే వారు ఒకటి రెండుసార్లు ఆలోచించుకోవాలని సూచించారు. డెయిరీలో ప్రతి పని నిబంధనలకు లోబడి మాత్రమే ఉందని, అసత్య ఆరోపణలను ప్రజలెవ్వరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

# అనుమతి లేకుండా స్కూల్ బయటకు వెళ్లొద్దు

## ఉపాధ్యాయులకు ఇన్‌చార్జి డీఈవో ఆదేశం

పెద్దపల్లి కమాన్, సెప్టెంబర్ 11 : పాఠశాలల పని వేళల్లో ప్రధానోపాధ్యాయుల అనుమతి లేకుండా ఉపాధ్యాయులు బయటకు వెళ్లొద్దని పెద్దపల్లి ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావు ఆదేశించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఉన్న పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పని చేస్తున్న ఒక ఉపాధ్యాయుడు సదరు ప్రధానోపాధ్యాయుడి అనుమతి లేకుండానే పెద్దపల్లి డీఈవో కార్యాలయానికి వెళ్లినట్టు తెలిసింది. దీనిపై హెచ్‌ఎంను వివరణ కోరగా, తనకు చెప్పకుండానే స్కూల్ పని వేళలో మధ్యాహ్నం 12.25 గంటలకు ఉపాధ్యాయుడు బయటకు వెళ్లినట్టు చెప్పారు. ఈ విషయంపై ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకునేందుకు ఇన్‌చార్జి డీఈవో ఆదేశాలు జారీ చేశారు. స్కూల్ నుంచి టీచర్లు బయటకు వెళ్లాల్సి వస్తే ప్రధానోపాధ్యాయుల అనుమతి తీసుకొని, మూమెంట్ రిజిస్టర్‌లో రాసి వెళ్లాలని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు

# స్కూల్ సూపర్.. ఫుడ్ బేకార్

- సిరిసిల్ల గీతానగర్ స్కూల్‌లో మధ్యాహ్నం భోజనం అధ్వానం
- నాణ్యతలేని సరుకులతో తయారీ
- తినలేకపోతున్న విద్యార్థులు
- ఇంటి నుంచే క్యారేజీ తెచ్చుకోవాల్సిన దుస్థితి
- పట్టని ఉన్నతాధికారులు

**సిరిసిల్ల గీతానగర్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం దూరమైతున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేమితో అధ్వానంగా మారుతున్నది. నీళ్ల చారు.. ఉడకని అన్నం.. నాణ్యతలేని పప్పు, చెడిపోయిన గుడ్లే ఇస్తుండగా, పిల్లల కడుపు మాడుతున్నది. ఈ పరిస్థితుల్లో పిల్లలు ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకోవాల్సి వస్తున్నది. అయినా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది.**

సిరిసిల్ల తెలంగాణ చౌక్, సెప్టెంబర్ 11 : సిరిసిల్ల గీతానగర్ పాఠశాల రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే అతి పెద్ద స్కూల్.. దాదాపు వెయ్యి మంది పిల్లలు.. బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో ఈ బడిని కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దగా, ఆదర్శంగా మారింది. సంఖ్యా పరంగానే కాదు ఏటా ఫలితాల్లోనూ ముందు వరుసలో నిలిచింది. అయితే ఇప్పుడు పాఠశాల నిర్వహణ గాడితప్పింది. మొన్నటిదాకా ఎంతో సక్సెస్‌ఫుల్‌గా నడిచిన మధ్యాహ్న భోజన పథకం కొద్దిరోజులుగా అధ్వానంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం, పట్టింపులేమితో విద్యార్థుల కడుపుమాడుతున్నది. ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు, నాణ్యతలేని కూరలు, చెడిపోయిన గుడ్లు వడ్డిస్తుండగా, పిల్లలు తినలేకపోతున్నారు. కూరలు ఇంటి నుంచి తెచ్చుకుంటే అన్నమైనా బాగుంటుందా..? అని అంటే సరిగ్గా ఉండడం లేదని, రైస్ ఉడకడం లేదని, అందులోనూ పురుగులు ఉంటున్నాయని, తింటే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. చేసేదేమి లేక నిత్యం 400 నుంచి 500 మంది ఇంటి నుంచే భోజనం తెచ్చుకుంటున్నారు. ఒక వేళ ఇంటి నుంచి భోజనం లేకపోతే మధ్యాహ్నం పస్తులుంటున్నారు. దీనిపై తల్లిదండ్రులు ఆగ్రహిస్తున్నారు. ఇంత మంచి పేరున్న పాఠశాలలో భోజనం ఇలా నాణ్యత లేకుండా పెడితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు సరిగ్గా పట్టించుకోకపోవడమే పేద విద్యార్థులకు శాపంలా మారిందని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయురాలు శారదను సంప్రదించగా, పాఠశాలలో భోజనం మంచిగానే తయారు చేయిస్తున్నామని చెప్పారు. కొందరు విద్యార్థులకు జ్వరాలు రావడం వల్ల పాఠశాలలో వండే ఫుడ్ రుచిగా లేదని, ఇంటి దగ్గరి నుంచి తెచ్చుకుంటున్నారని తెలిపారు.

### రోజూ భోజనం తీసుకెళ్లి ఇస్త

నాది సుభాష్‌నగర్. మా అమ్మాయి గీతానగర్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నది. గతేడాది మధ్యాహ్న భోజనం బాగుండేది. కానీ కొన్ని నెలల నుంచే ఉడికీ ఉడకని అన్నం, నీళ్లలాంటి కూరలు పెడుతున్నరని పిల్లలు తినడమే మానేసిన్రు. పేరెంట్స్ మీటింగ్‌లో భోజనం గురించి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. చేసేదేం లేక రోజూ మధ్యాహ్నం ఇంటి నుంచి భోజనం తీసుకెళ్లి మా పాపకు ఇస్తున్న.

**- విద్యార్థిని తండ్రి**

మధ్యాహ్న భోజనం తినలేక పడేస్తున్న విద్యార్థులు



**ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం పురుషులకు కష్టాలు తెచ్చిపెట్టిందా..? ప్రయాణం కోసం వారు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాల్సి వస్తున్నదా..? ఫలితంగానే ఆర్టీసీలో ప్రయాణించే మగవాళ్ల రేషియో తగ్గిందా..? గతంతో పోలిస్తే సీన్ రివర్స్ అయిందా..? అంటే అవుననే సమాధానమే వస్తున్నది. గడిచిన ఎనిమిది నెలల్లో కరీంనగర్ రీజియన్‌లో ప్రయాణించిన వారి సంఖ్యే దీనికి నిదర్శనం! నిజానికి మహాలక్ష్మి పథకం రాక ముందు.. బస్సుల్లో మహిళలకన్నా పురుషుల సంఖ్యే అధికంగా ఉండేది. అప్పటి రేషియో ప్రకారం చూస్తే దాదాపు 65 శాతం పురుషులు, 35 శాతం మహిళలుండే వారు. కానీ, ఫ్రీ ప్రయాణంతో మహిళల సంఖ్య రెట్టింపుకాగా, పురుషుల సంఖ్య క్రమేపీ తగ్గుతున్నది. ఎనిమిది నెలల కాలంలో రీజియన్‌లోని 11 డిపోల పరిధిలో 9.46 కోట్ల మంది ప్రయాణిస్తే.. అందులో 67.11 శాతం మంది మహిళలు, కేవలం 32.88 శాతం మంది పురుషులుండడం గమనార్హం!**



కరీంనగర్ బస్టేషన్‌లో బస్సెక్కుతున్న మహిళలు

# ‘మహాలక్ష్మి’తో మగవాళ్లకు కష్టాలు!

## ఆర్టీసీలో సీన్ రివర్స్

- కరీంనగర్ రీజియన్‌లో తగ్గుతున్న పురుషుల రేషియో
- పల్లె డిపోల్లో ఇంకా అధికం
- ఎనిమిది నెలల్లో ప్రయణికుల సంఖ్య : 9.46 కోట్లు
- మహిళల సంఖ్య : 6.35 కోట్లు..
- పురుషుల సంఖ్య : 3.11 కోట్లు
- అధికలోడ్‌తో బస్సులు నడుపలేమంటున్న సిబ్బంది
- కొత్త బస్సులు కావాలని డిమాండ్

కరీంనగర్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి/ తెలంగాణ చౌక్) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఆర్టీసీలో మహాలక్ష్మి పథకాన్ని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. గతేడాది డిసెంబర్ 9 నుంచి ఇది అందుబాటులోకి వచ్చిన విషయం విదితమే. అయితే ఈ పథకాన్ని ప్రభుత్వం ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగుకు పూర్తి స్థాయిలో వర్తింప జేస్తున్నది. ఈ పథకం కింద ఉచితంగా ప్రయాణించే మహిళలు తమ ఆధార్ కార్డు చూపిస్తే సరిపోతుంది. కండక్టర్లు జీరో టికెట్ ఇస్తుండగా, జీరో టికెట్‌కు సంబంధించిన డబ్బులను ప్రభుత్వమే ఆర్టీసీకి చెల్లిస్తుంది. ఆర్టీసీ గణాంకాల ప్రకారం చూస్తే.. ఉచిత పథకాన్ని మహిళలు బాగా వినియోగించుకుంటుండగా, గతంతో పోలిస్తే బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య దాదాపు రెట్టింపైంది. మహాలక్ష్మి పథకం అమల్లోకి రాక ముందు రీజియన్ పరిధిలో రోజుకు 2.21 లక్షల మంది బస్సుల్లో ప్రయాణించగా, ప్రస్తుతం ఆ సంఖ్య 4.15 లక్షలకు చేరింది. పండుగలు, తీర్థయాత్రలు, జాతరల సమయంలో ఈ సంఖ్య సుమారు ఐదు లక్షలు దాటే అవకాశమున్నది.

### పెరిగిన రేషియో

ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌లోని 11 డిపోల పరిధిలో మొత్తం 875 బస్సులు నడుస్తున్నాయి. అందులో పల్లెవెలుగు 327, 229 ఎక్స్‌ప్రెస్‌లు ఉండగా, మిగిలినవి ఇతర బస్సులున్నాయి. ఉమ్మడి జిల్లాలో చూస్తే గత డిసెంబర్ నుంచి జూలై చివరి వరకు అంటే దాదాపు ఎనిమిది కాలంలో ఆర్టీసీలో ప్రయాణించిన మొత్తం ప్రయాణికుల సంఖ్య 9.46 కోట్లు! అందులో మహిళల సంఖ్య 6.35 కోట్లు కాగా, పురుషుల సంఖ్య 3.11 కోట్లుగా ఉన్నది. రేషియో ప్రకారం చూస్తే మహిళల శాతం 67.11 కాగా, పురుషుల శాతం 32.88గా ఉన్నది. నిజానికి గతంలో మహిళలకన్నా.. పురుషులే అధికంగా ప్రయాణించే వారు. కానీ, ప్రస్తుతం సీన్‌రివర్స్ అయింది. అంతేకాదు, పథకానికి ముందు రీజియన్‌లో 68.13 శాతం ఉన్న ఆక్యుపెన్సీ రేషియో ప్రస్తుతం అది 85.33కు పెరిగింది. అంటే దాదాపు 17.2 శాతం పెరిగింది.

### బస్సుల సంఖ్య పెరగాలి

రీజియన్ పరిధిలో గతంలో రోజుకు 2.21 లక్షల మంది ప్రయాణిస్తే.. ప్రస్తుతం ఆ సంఖ్య 4.15 లక్షలకు పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. పథకం అమల్లోకి రాక ముందు ఒక్కో బస్సులో (అన్ని ట్రిప్పులు కలిపి) సుమారు 252 మంది వరకు ప్రయాణించగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 415కు పెరిగింది. అంటే సగటున రోజుకు ఒక బస్సుల్లో అదనంగా 222 మంది ప్రయాణిస్తున్నారు. దీనిని పరిగణలోకి తీసుకొని చూస్తే.. రీజియన్ పరిధిలో ప్రస్తుతం ఉన్న 875 ఆర్టీసీ బస్సులకు అదనంగా మరో 300 బస్సులైనా పెరగాల్సిన అవసరం ఉన్నది. కానీ, ఇప్పట్లో కొత్త బస్సులు వచ్చే అవకాశాలు తక్కువ. అద్దె బస్సులను కూడా తీసుకోవచ్చు. కానీ, ఖర్చుతో కూడుకున్నదని, ప్రభుత్వం ఉన్న బస్సులతోనే సరిపెడుతున్నదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా ఓవర్‌లోడ్‌తో బస్సులు నడపాల్సి వస్తున్నదని, అందులోనూ 60 శాతం పాత బస్సులే ఉండడం వల్ల ఆ లోడ్ మోయడం, అందుకు అనుగుణంగా బస్సును నడపడం ఇబ్బంది అవుతున్నదని డ్రైవర్లు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీలో కొత్త బస్సుల అవసరాన్ని ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరమున్నది. అలాగే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఇవ్వడాన్ని ఎవరూ తప్పు పట్టడం లేదు కానీ, ఇదే సమయంలో డబ్బులు పెట్టి ప్రయాణించే మగవాళ్ల సమస్యను కూడా ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్న డిమాండ్ వస్తున్నది. మగవాళ్ల సంఖ్య పెరిగినప్పుడే.. ప్రభుత్వం ఉచితానికి సంబంధించి డబ్బులు ఇచ్చినా.. ఇవ్వకపోయినా మగవాళ్ల చార్జీలతోనైనా ఆర్టీసీ మనుగడ సాధించడానికి మార్గం ఏర్పడుతుందన్న అభిప్రాయాలు కార్మికుల నుంచే వ్యక్తమవుతున్నాయి.

### ఆసక్తి చూపని పురుషులు

పెరిగిన రేషియోకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెరగాలి. అందులో మాత్రం పెద్దగా తేడా లేదు. దీంతో బస్సుల్లో సీట్లు దొరకడం గగనంగా మారింది. ప్రతి బస్సులోనూ మహిళలకే సీట్లు సరిపోవడం లేదు. దీంతో చాలా మంది పురుషులు తమ ప్రయాణాలకు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్నారు. ఎక్కువ శాతం మంది తమ ప్రయాణాలకు ద్విచక్ర వాహనాలు వినియోగిస్తున్నారు. అలాగే, మరికొంత మంది ఇతర మార్గాల ద్వారా ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రయాణికుల రేషియోకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెరగక పోవడం, బస్సుల్లో సీట్లు దొరక్కపోవడం.. సమయానికి అనుగుణంగా బస్సులు లేకపోవడం, చాలా ప్రాంతాలకు ట్రిప్పులు తగ్గడం, వంటి పరిస్థితుల నేపథ్యంలో పురుషులు ఆర్టీసీలో ప్రయాణించడానికి పెద్దగా ఆసక్తి చూపకుండా ప్రత్యామ్నాయం వెతుక్కుంటున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మహాలక్ష్మి పథకంతో ప్రయాణించే మహిళల సంఖ్య రెట్టింపు కాగా.. మగవాళ్లకు కష్టాలు తెచ్చిపెట్టారనే విమర్శలు వస్తున్నాయి. ఇటు ఇటీవలి కాలంలో ఓవర్‌లోడ్ వల్ల తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆర్టీసీ కార్మికులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ ఇరువై రోజుల క్రితం ఓ డ్రైవర్.. ఓవర్‌లోడ్‌తో బస్సు నడుపలేక హుజూరాబాద్ వద్ద బస్సు ఆపేసి, నిరసన తెలిపిన విషయం తెలిసిందే.

**డిపోల వారీగా ప్రయాణికుల సంఖ్య**

| డిపో | ప్రయాణికులు (లక్షల్లో) | మహిళలు (లక్షల్లో) | పురుషులు (లక్షల్లో) |
|---|---|---|---|
| కరీంనగర్-1 | 88.97 | 54.32 | 34.65 |
| కరీంనగర్-2 | 107.07 | 68.53 | 38.54 |
| హుజూరాబాద్ | 76.34 | 49.20 | 27.14 |
| హుస్నాబాద్ | 65.03 | 44.23 | 20.8 |
| గోదావరిఖని | 136.73 | 88.40 | 48.33 |
| మంథని | 53.42 | 35.76 | 17.66 |
| జగిత్యాల | 130.09 | 90.03 | 40.06 |
| కోరుట్ల | 66.98 | 48.62 | 18.36 |
| మెట్‌పల్లి | 67.80 | 49.48 | 18.32 |
| రాజన్నసిరిసిల్ల | 72.64 | 46.79 | 25.85 |
| వేములవాడ | 81.53 | 59.95 | 21.58 |
| మొత్తం | 946.6 | 635.31 | 311.29 |



ఏర్పాటు చేసిన 54 ఫీట్ల మట్టి వినాయకుడు

# 54 అడుగుల భారీ మట్టి గణపతి

పెద్దపల్లి కమాన్, సెప్టెంబర్ 11 : పెద్దపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో 54 అడుగుల భారీ మట్టి గణపతిని ఏర్పాటు చేశారు. ఛత్రపతి యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు శివంగారి సతీశ్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఏటా ఇక్కడ అతిపెద్ద మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుండగా, కోల్‌కతాకు చెందిన కళాకారులు దాదాపు 45 రోజుల పాటు శ్రమించి విగ్రహం రూపొందించారని సతీశ్ తెలిపారు.

# డిగ్రీ ఫలితాలు విడుదల

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 11 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ ఫలితాలు విడుదల చేసినట్టు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగప్రసాద్ బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. ఏప్రిల్, జూన్‌లో నిర్వహించిన డిగ్రీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు చెప్పారు.

# అందని ఆహ్లాదం!

## అర్బన్ ఫారెస్ట్‌కు మోక్షమేది?

- కేసీఆర్ ప్రభుత్వంలో 60 ఎకరాల్లో పార్కు నిర్మాణం
- ఏడాదిలోనే 90శాతం పనులు పూర్తి
- ప్రారంభించకున్నా సందర్శకులకు ఎంట్రీ
- సర్కారు మారడంతో నిర్లక్ష్యం
- పార్కుకు తొమ్మిది నెలలుగా తాళం
- మండిపడుతున్న ప్రజానీకం



**సిరిసిల్ల జిల్లా హరిదాస్‌నగర్‌లోని దట్టమైన అటవీ ప్రాంతంలో గుట్టల మధ్య తీర్చిదిద్దిన అర్బన్ ఫారెస్ట్‌కు మోక్షం కరువైంది. హైదరాబాద్ లాంటి నగరాల తరహాలో పెద్ద పార్కులను కొత్త జిల్లాల్లో ఉండాలన్న సంకల్పంతో కేసీఆర్ సర్కారు 60 ఎకరాల స్థలంలో ప్రత్యేక వసతులతో తీర్చిదిద్దగా, ప్రారంభంపై కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం చేస్తున్నది. ₹3కోట్ల వ్యయంతో పంచవటి, నవగ్రహ నక్షత్ర వనాలు, సైకిల్ ట్రాక్, ట్రెక్కింగ్, యోగా సెంటర్లు ఏర్పాటు చేసి 90శాతం పనులు పూర్తిచేసినా.. తొమ్మిది నెలలుగా తాళం వేసే ఉంచుతున్నది. గత ప్రభుత్వానికి ఎక్కడ పేరు వస్తుందోనని మూసేయగా, ఆ అందమైన బృందావనం కళ తప్పిపోతున్నది. ఇప్పటికైనా ప్రారంభించి, సందర్శకులకు అనుమతించాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నది.**

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల జిల్లా ప్రజల ఆహ్లాదం, ఆనందం కోసం కేసీఆర్ ప్రభుత్వం అర్బన్ ఫారెస్ట్‌కు శ్రీకారం చుట్టింది. అప్పటి మంత్రి కేటీఆర్ చొరవతో జిల్లాకేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో సిరిసిల్ల – కామారెడ్డి ప్రధాన రహదారిని ఆనుకొని ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గుట్టల్లో 2022 జూన్ 26న పనులు ప్రారంభించింది. 60 ఎకరాలలో ₹3 కోట్ల వ్యయంతో పనులు చేపట్టింది. ఏడాదిలోగా పూర్తి చేసే లక్ష్యంతో చకచకా పనులు పూర్తి చేసింది. సైకిల్ ట్రాక్, ట్రెక్కింగ్, పంచవటి, నవగ్రహ నక్షత్ర వనాలు, పర్కులేషన్ ట్యాంకులు నిర్మించారు. పచ్చనిచెట్ల మధ్య ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని ఇచ్చే ఆయుర్వేద మొక్కలను ఏర్పాటు చేశారు. పార్కులో గుట్ట కింది బాగాన సేద తీరేందుకు గజిబోను నిర్మించారు. రోడ్డు నుంచి కిలోమీటరు దూరంలో పచ్చని చెట్ల మధ్యన యోగా కేంద్రాన్ని, ఇంటర్నల్ రోడ్లు నిర్మించారు. ప్రవేశ ద్వారం, లోటస్‌పాండ్, చిల్డ్రన్స్ ప్లే గార్డెన్, వివిధ ఆకృతుల్లో కూర్చొనే బెంచీలు, బాత్రూంలు, టాయిలెట్లు, బటర్ ఫ్లై గార్డెన్, ఆల్ఫాబెట్ ఏరియాను పూర్తి చేశారు. పర్కులేషన్ ట్యాంకులు నిర్మించారు. పార్కుకు వచ్చే సందర్శకులకు స్వాగతం పలికేలా అద్భుతమైన ముఖ ద్వారం రూపొందించారు. ఇంకా చిన్నారులు ఆడుకునేందుకు కొన్ని వసతులు కల్పించాల్సి ఉంది.

### తొమ్మిది నెలలుగా తాళం

అటవీ శాఖ పర్యవేక్షణలో నిర్వహించే అర్బన్ ఫారెస్ట్ పార్కు నిర్మాణం 90శాతం గతేడాదే పూర్తయింది. అట్టహాసంగా ప్రారంభించకపోయినప్పటికీ కొద్దిరోజులు తెరిచి ఉంచారు. సందర్శకులను అనుమతించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి వివిధ పాఠశాలల విద్యార్థులు వచ్చి పార్కును సందర్శించారు. అయితే ప్రభుత్వం మారడంతో పార్కుకు గ్రహణం పట్టింది. గత ప్రభుత్వానికి ఎక్కడ పేరు వస్తుందనుకున్నారో..? ఏమో! మూసివేశారు. సందర్శకులను అనుమతించడం లేదు. తొమ్మిది నెలలుగా వేసిన తాళం వేసినట్లే ఉంది. నెలలు గడుస్తున్నా తెరవడం లేదు. అధికారులను అడిగితే తమకు తెలియదంటూ దాటవేస్తున్నారు. అందమైన పార్కు ఆలనా పాలనా లేక, సందర్శకులను అనుమతించక పోవడంతో వేసిన రహదారులపై పిచ్చిమొక్కలు మొలిచాయి. యోగ సెంటర్, గజిబోను, పర్కులేషన్ ట్యాంకులు నిరుపయోగమవుతున్నాయి. అధికారులు స్పందించి పార్కును ప్రారంభించి సందర్శకులను అనుమతించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



నిండుగా లోయర్ మానేరు జలాశయం

# ఎల్‌ఎండీ @ 23.775 టీఎంసీలు

తిమ్మాపూర్, సెప్టెంబర్ 11: ఇటీవలి వర్షాలతో లోయర్ మానేరు జలాశయం నిండుగా మారింది. మోయతుమ్మెద వాగుతోపాటు ఎగువ నుంచి భారీగా వచ్చిన వరదతో పూర్తిస్థాయిలో కళకళలాడుతున్నది. 24.034టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి ప్రాజెక్టులో ప్రస్తుతం 23.775 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ప్రస్తుతం 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. అయితే గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తారని అందరూ అనుకున్నప్పటికీ.. ప్రస్తుతం పై నుంచి వరద ఎక్కువగా లేకపోవడంతో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ ఉంచుతామని ప్రాజెక్టు ఈఈ నాగభూషణ్‌రావు తెలిపారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం

మరియు

- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571